సాక్షి పెద్దపల్లి

గురువారం । 26 । డిసెంబర్ । 2024



పెద్దపల్లి సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులను ఆశీర్వదిస్తున్న ఫాదర్



బైబిల్ చదువుతున్న యువతి



పెద్దపల్లి సీఎస్ఐ చర్చిలో ఫాదర్ శాంతిసందేశం



బిలీవర్ చర్చిలో జరిగిన వేడుకల్లో క్రైస్తవులు



క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ..



పెద్దపల్లి చర్చిలో జరిగిన వేడుకలకు హాజరైన క్రైస్తవులు

శాంతి.. సహనం.. కరుణ

శాంతి.. సహనం.. కరుణ.. క్షమాగుణం లాంటి క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని పలువురు ప్రముఖులు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని రామగుండం నగరంతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ ప్రాంతాలు, గ్రామాల్లోని చర్చిల్లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. మతపెద్దలు క్రీస్తు బోధనలు చదివి వినిపించారు. శాంతిసందేశం ఇచ్చారు.

– పెద్దపల్లిరూరల్/సాక్షి ఫొటోగ్రాఫర్



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

న్యూస్‌రీల్

'రుణమాఫీ పేరిట బీఆర్ఎస్ మోసం'



లబ్ధిదారులతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రుణమాఫీ పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.9.10 లక్షల విలువైన చెక్కులు ఆయన అందించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 70 శాతానికిపైగా రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అంతర్గాం తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'అటల్' రాజనీతిజ్ఞుడు



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): సుపరిపాలన అందించిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గాండ్ల ధర్మపురి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో బుధవారం అటల్‌బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ధర్మపురి మాట్లాడారు. గ్రామీణ సడక్ యోజన, సర్వ శిక్ష అభియాన్, ఫోఖ్రాన్ పరీక్షలతో భారత్‌ను విశ్వవేదికపై ఒక శక్తిగా నిలిపిన వ్యక్తి అటల్‌బిహారీ వాజ్‌పేయ్ అని అన్నారు. నాయకులు మేడి తిరుపతి, సత్యనారాయణ, నర్సింగ్, సిలివేరి ఆంజనేయులు, ఈదునూరి చిరంజీవి, గొర్రె రాజు, దామరకుంట గణేశ్, పల్లికొండ రమేశ్, ఉప్పలంచ శ్రీనివాస్, తోట రవి పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం



రాజేందర్‌ను సన్మానిస్తున్న రమణాచారి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): జానపద కళాకారుడిగా విశిష్ట సేవలు అందించినందుకు జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు అంబాల రాజేందర్‌ను పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సారిపల్లి కలొండలరావు ఫౌండేషన్ తరఫున తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి గద్దర్ వెన్నెలమ్మ, సాంస్కృతిక మాజీ సలహాదారు కేవీ రమణాచారి బుధవారం హైదరాబాద్‌లో ఆయనకు పురస్కారం అందించి సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి



క్రిస్మస్ వేడుకల్లో కొప్పుల ఈశ్వర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 16రోజులుగా సమ్మె చేస్తున్నా పాలకులు నిర్లక్ష్యం చేయడం సరికాదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని బుధవారం వారు సందర్శించారు. తొలుత క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథరావు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు రఘువీర్‌సింగ్, తిరుపతి, సంధ్యారాణి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, స్వప్న, విజయలక్ష్మి, మంజుల, కల్పన, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి డీఆర్డీవోగా కాళిందిని



కాళిందిని

పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్డీవో) అధికారిగా కాళిందినిదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన కాళిందినిదేవిని పెద్దపల్లి డీఆర్డీవోగా డెప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీఆర్డీవో రవీందర్ రాథోడ్‌ను ఆదిలాబాద్ డీఆర్డీవోగా బదిలీ చేశారు.

కుటుంబంతో కాసేపు..

- సమయం వృథా కాకుండా చర్యలు
- బొగ్గు గనుల్లో షిఫ్ట్ సమయాల మార్పు
- ఉద్యోగులకు అనుకూలంగా విధులు
- ప్రతిపాదనలు రూపొందించిన సేఫ్టీ కమిటీ బృందం
- ఓసీపీల్లో అమలుకు కసరత్తు

డ్యూటీకి వెళ్లే ముందు తమ కుటుంబ సభ్యులతో కార్మికులు కాసేపు ప్రశాంతంగా, మనసు విప్పి మాట్లాడుకునేలా సింగరేణి యాజమాన్యం షిఫ్ట్‌ల సమయాన్ని మార్చు చేయాలని యోచిస్తోంది. పనిస్థలాల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని భావిస్తోంది. ఉద్యోగి మానసికంగా దృఢంగా ఉంటే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధించడంతోపాటు ప్రమాదరహితంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని చెబుతోంది. ఇందుకోసం డ్యూటీ సమయాలను మార్చాలని ప్రణాళిక రూపొందించింది.



గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో సుమారు 42 వేల మంది పర్మినెంట్, మరో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పని(షిఫ్ట్)వేళలను మార్చేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. కార్మికుల స్పందన, కార్మిక సంఘాల సమాలోచనల తర్వాత తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిసింది. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న షిఫ్ట్ సమయాలను కార్మికులకు అనుకూలంగా మార్చాలనే యోచనలో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది. ఇటీవల నిర్వహించిన రక్షణ పక్షోత్సవాల్లో ఈ ప్రతిపాదన వచ్చింది. కార్పొరేట్ సేఫ్టీ కమిటీ సభ్యులు దీనిపై విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. ప్రధానంగా ఓసీపీల్లో కొత్త షిఫ్ట్‌లతో సమయం ఆదా కావడంతోపాటు కార్మిక కుటుంబాలకు కూడా అనుకూలంగా ఉంటుందని భావిస్తోంది.

కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయాలనేది లక్ష్యం..

ఉదయం కాస్త ముందుగా డ్యూటీకి వెళ్లినా మధ్యాహ్నం ఒంటి గంటకు ఇళ్లకు చేరుకునే కార్మికులు.. తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తే ఎంతో ఊరట లభిస్తుందని యాజమాన్యం భావిస్తోంది. అలాగే సెకండ్ షిఫ్ట్ కార్మికులు కూడా కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి డ్యూటీకి వెళ్లవచ్చని, రాత్రి షిఫ్ట్ కార్మికులు కాస్త ముందుగా డిన్నర్ చేసి డ్యూటీకి వెళ్ల వచ్చని, ఇది కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. ఈక్రమంలో యాజమాన్యానికి రక్షణ కమిటీ బృందాలు నివేదిక సమర్పించినట్లు సమాచారం. డ్యూటీ సమయాల మార్పుపై కార్మికుల నుంచి కూడా సానుకూలంగా స్పందన వచ్చినట్లు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో నూతన పనివేళలను అమలు చేయాలనే ప్రతిపాదన సీరియస్‌గా పరిశీలిస్తున్నారు.

సమయపాలనపై ప్రత్యేక నజర్

సింగరేణిలో ఎనిమిది గంటల పని విధానం కొనసాగుతోంది. భూగర్భగనులు, ఓసీపీల్లోనూ ఇదే పద్ధతి అమలు చేస్తున్నారు. అయితే భూగర్భగనుల్లో డ్యూటీకి కార్మికులు కాస్త ఆలస్యంగా వెళ్లినా పెద్దగా సమస్య రావడంలేదు. కానీ, ఓసీపీల్లో గంటన్నరపాటు సమయం వృథా అవుతోందని అధికారులు తేల్చారు. ఇందులో కొంత సమయాన్ని ఆదా చేయాలనే యోచనలో సింగరేణి యాజమాన్యం ఉంది. ఓసీపీల్లో రోజూ నాలుగున్నర గంటల పాటు సమయం లంచ్‌బ్రేక్ పేరిట వృథాగా పోతోందని గుర్తించారు. ఈక్రమంలో దీనిలో కొంత సమయాన్ని ఆదా చేసినా సంస్థలో భారీ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించవచ్చని అంటున్నారు. ఈక్రమంలో ఓసీపీల్లో లంచ్‌బ్రేక్ సమయం తగ్గించి ఇంటివద్దనే భోజనం చేసి వచ్చేలా షిఫ్ట్ సమయాలను మార్చాలని నిర్ణయించారు.

కార్మికులకు బ్రేక్‌ఫాస్ట్..

ఓసీపీల్లో డ్యూటీకి వెళ్లే కార్మికులు మస్టర్ పడిన సమయంలోనే యాజమాన్యం బ్రేక్‌ఫాస్ట్ అందజేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. దీనివల్ల కార్మికులు యంత్రాల్లోనే కూర్చుని అల్పాహారం చేసి ఆ తర్వాత ఉత్పత్తిపై దృష్టి సారిస్తారని అంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్‌లో కోడిగుడ్డు, అరటిపండు, సమోస, బ్రెడ్, బన్.. లాంటివి ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బ్రేక్‌ఫాస్ట్‌తో విధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతోపాటు లంచ్ పేరిట హాలేజీ రోడ్ల వెంట ప్రమాదకర ప్రయాణం ఉండదని భావిస్తున్నారు. దీనిపై కూడా యాజమాన్యం ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతిపాదిత సమయాలు(గంటల్లో)

షిఫ్ట్	నుంచి	వరకు
మొదటి(ఫస్ట్)	ఉదయం 5.00	మధ్యాహ్నం 1.00
రెండో(సెకండ్)	మధ్యాహ్నం 1.00	రాత్రి 9.00
మూడో(రాత్రి)	రాత్రి 9.00	వేకువజాము 5.00

ప్రస్తుత సమయాలు

షిఫ్ట్	నుంచి	వరకు
మొదటి(ఫస్ట్)	ఉదయం 7.00	మధ్యాహ్నం 3.00
రెండో(సెకెండ్)	మధ్యాహ్నం 3.00	రాత్రి 11.00
మూడో(నైట్)	రాత్రి 11.00	ఉదయం 7.00
ప్రీ(ముందు)	ఉదయం 5.00	మధ్యాహ్నం 1.00

కొన్ని గనుల్లో ఐదు షిఫ్టుల విధానం కూడా కొనసాగుతోంది



మహా పడిపూజ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మహాపడి పూజ వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యస్వామి మాలలు ధరించిన భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాన్ని రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించారు.

క్రీస్తు దీవెనలు అందరిపై ఉండాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని: ఏసుక్రీస్తు చల్లని దీవెనలు అందరిపై ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా డివిజన్‌లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంథని ఎరుకలగూడెం బేతేలు గాస్పెల్ ప్రేయర్ మినిస్ట్రీస్, శ్రీపాదకాలనీ సియోను ప్రార్థనా మందిరంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా మందిరాల నిర్మాణానికి తాము అధికారంలో ఉండగా సరిపడా నిధులు మంజూరు చేశామని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుత సమయంలోనూ అవసరమైన మేర నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం త్వరలో ప్రారంభించబోతుందని తెలిపారు. అర్హులైన క్రైస్తవ కుటుంబాలకు కూడా అందులో అవకాశం కల్పిస్తామని మంత్రి తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు శశిభూషణ్ కాచే, మంథని సత్యం, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

కాంగ్రెస్ నేతకు పరామర్శ

రామగిరి(మంథని): నాగెపల్లి గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. తిరుపతి యాదవ్ ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకుని ఇంటికి వచ్చారు. దీంతో మంత్రి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోడ్డ బాపన్న, చిందం మహేశ్, బండారి సదానందం, ఒర్రె సదయ్య, ముచ్చకుర్తి శ్రీనివాస్, బంక్ మల్లేశ్ పాల్గొన్నారు.

30 వరకు ప్రవేశాలు


జ్యోతినగర్(రామగుండం): ఓపెన్ పది, ఇంటర్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రత్యేక ప్రవేశాల కోసం తత్కాల్ షెడ్యూల్ ద్వారా ఈనెల 30వ తేదీ వరకు మరోసారి గడువు పొడిగించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. దరఖాస్తులు చేసుకున్నవారు హార్డ్‌కాపీలను సబంధిత సెంటర్‌లో అందించాలని సూచించారు. ప్రవేశఫీజు మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. వివరాలకు 83092 12661లో సంప్రదించాలన్నారు.

కాలువ నీటితో కరెంట్ ఉత్పత్తి

- ఎస్సారెస్పీ డీ–83 కాలువపై 10 మినీ హైడల్ ప్రాజెక్టులు
- జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ : 56 మందికి ఉపాధి కల్పన
- గ్రిడ్‌కు అనుసంధానంతో లో వోల్టేజీ సమస్యకు చెక్
- ఉత్పత్తి వ్యయం తక్కువ.. నాణ్యత ఎక్కువ



విద్యుత్‌ను ఉత్పత్తి చేసే టర్బైన్లు, జనరేటర్లు



కుమ్మరికుంట వద్ద డీ-83 కాకతీయ కాలువపై నిర్మించిన మినీ జల విద్యుత్ కేంద్రం

జూలపల్లి(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆయకట్టుకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ డీ–83 కాకతీయ కాలువపై వివిధ చోట్ల ఏర్పాటు చేసిన మినీ హైడల్(జల విద్యుత్) ప్రాజెక్టుల ద్వారా రోజూ 9.16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అంతేకాదు.. వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఇలా తయారైన కరెంట్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా లో వోల్టేజీ సమస్య కూడా పరిష్కారమవుతోంది.

జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ..

శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ) ప్రాజెక్టు డీ – 83 ప్రధాన కాలువ, డీ – 86 కాలువల ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇందులోని డీ–83పై మినీ హైడల్ ప్రాజెక్టులు నిర్మించగా.. జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టారు. ఇది జిల్లాలోని ధర్మారం మండలం నుంచి జూలపల్లి, పెద్దపల్లి వరకు, ఆ తర్వాత సుల్తానాబాద్ తదితర మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. అయితే, ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు విడుదల చేసిన ప్రతీసారి డీ –83 మెయిన్ కెనాల్‌పై నిర్మించిన పది మినీ హైడల్ ప్రాజెక్టుల్లో రోజూ 9.16 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

పది జలవిద్యుత్ కేంద్రాలు..

శ్రీరాంసాగర్ డీ–83 మెయిన్ కెనాల్‌పై వివిధ చోట్ల పది మినీ హైడల్ కేంద్రాలు నిర్మించారు. వీటికి టర్బైన్లు బిగించారు. జనరేటర్లు ఏర్పాటు చేశారు. నీటి ఉధృతితో టర్బైన్లు తిరుగుతూ జనరేటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనిని ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా 33కేవీ లైన్‌కు అనుసంధాంచి తుర్కలమద్దికుంటలోని సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి వివిధ డిస్కంలకు కరెంట్ పంపిణీ చేస్తున్నారు.

చొప్పదండిలో ప్రారంభం..

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రెవెల్లె గ్రామం వద్ద ప్రారంభమయ్యే డీ– 83 కాలువపై పలు చోట్ల 10 మినీ హైడల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట 6వ మైలురాయి వద్ద 500 కిలోవాట్ల సామర్థ్యం గల జల వద్యుత్ కేంద్రాలు నిర్మించారు. అదే విధంగా ఏడో మైలురాయి అబ్బాపూర్ వద్ద 500 కిలోవాట్లవి, తొమ్మిదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 500 కిలోవాట్లవి, పదో మైలురాయి కుమ్మరికుంట వద్ద 220 కిలోవాట్లవి, పన్నెండో మైలురాయి కాచాపూర్ వద్ద 325 కిలోవాట్లవి, 14వ మైలురాయి పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట వద్ద 500 కిలోవాట్లవి, 16వ మైలురాయి చందపల్లి వద్ద 500 కిలోవాట్ల జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి.

56 మందికి ఉపాధి..

పది జల విద్యుత్ కేంద్రాల్లో 56 మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. ఐటీఐ పూర్తిచేసి అప్రెంటీస్‌లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులను జెన్‌కో అధికారులు ఇక్కడ ఆపరేటర్లుగా నియమించారు. కాలువలో సామర్థ్యం మేరకు నీటి పారకం ఉన్నసమయంలో ఆపరేటర్లు టర్బైన్లు ఆన్ చేస్తారు. జనరేటర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సాఫీగా సాగేలా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. అంతేకాదు.. ప్రతీ వేసవిలో టర్బైన్లు, జనరేటర్లను ఓవర్‌హాలింగ్ చేసి.. విద్యుత్ ఉత్పత్తికి సన్నద్ధం చేయడంలో జెన్‌కో అధికారులు వీరికి సాయం చేస్తూ ఉంటారు.

మినీ జలవిద్యుత్ కేంద్రాలు

మండలం	ప్రాంతం	ప్రాజెక్టులు
పెద్దపల్లి	చందపల్లి	2
పెద్దపల్లి	బొంపల్లి	1
పెద్దపల్లి	తుర్కలమద్దికుంట	2
జూలపల్లి	కాచాపూర్	1
జూలపల్లి	కుమ్మరికుంట	2
జూలపల్లి	అబ్బాపూర్	1
ధర్మారం	కమ్మర్‌ఖాన్‌పేట	1

నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి

ఎస్సారెస్పీ డీ– 83 మెయిన్ కాలువలో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినప్పుడు టర్బైన్లను ఆన్‌చేసి జనరేటర్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. అక్కడి నుంచి సబ్‌స్టేషన్‌కు తరలించి డిస్కంకు సరఫరా చేస్తున్నాం. ఇక్కడ తక్కువ ఖర్చుతో జల విద్యుత్ ఉత్పత్తి చేయడమే మినీ హైడల్ ప్రాజెక్టుల లక్ష్యం.

– నరేశ్, డీఈ, జెన్‌కో

క్లుప్తంగా

చిట్టీ వ్యాపారిపై కేసు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధికి చెందిన ఠాకూర్ హనుమాన్ ప్రసాద్ అనే చిట్టీ వ్యాపారి పలువురి నుంచి చిట్టీల పేరిట వసూలు చేశాడు. ఆ డబ్బుతో ఉడాయించిన వ్యవహారంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. భూంనగర్‌కు చెందిన రాచకట్ల నర్సింహస్వామి తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

పాలకుర్తి(రామగుండం): కుక్కలగూడూరు గ్రామంలో మంగళవారం రాత్రి వ్యవసాయ పంపుసెట్లు చోరీకి గురయ్యాయి. నలిమెల సత్తయ్యకు చెందిన విద్యుత్ మోటార్, ఇనుప పరికరాలు, మేడం రాజమౌళికి చెందిన మరో విద్యుత్ మోటారు చోరీకి గురయ్యాయి. వీటివిలువ దాదాపు రూ.65వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. యాసంగి వరినాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో చోరీ జరగడంతో నాట్లు వేసేందుకు ఆలస్యమవుతుందని, అంతేకాకుండా తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చింతకుంట చెరువులో పడి షేక్ ఇక్బాల్ (58) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డిలోని హనుమాన్‌వాడకు చెందిన షేక్ ఇక్బాల్, సబేర దంపతులకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. చిన్న కుమారుడు జాకీర్ జగిత్యాలలో నివాసం ఉంటాడు. కొద్దిరోజుల క్రితం చిన్న కొడుకు వద్దకు వచ్చి బీట్‌బజార్లో ఉంటున్నాడు. ఈనెల 22న మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె తన వద్ద లేవనడంతో కూరగాయలు కోసే కత్తితో సబేర గొంతుకోసి పరారయ్యాడు. సబేరను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ భయంతో షేక్ ఇక్బాల్ చింతకుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సబేర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు.

బావిలో పడి రైతు మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లిలో ఓ రైతు వరినారుకు నీరు పెట్టడానికి వెళ్లి కాలుజారి బావిలో పడి చనిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గజేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిర్రి రాజన్న (65) నారుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. మోటార్ ఆన్‌చేసే క్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. రాజన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కలిసి పొలం వద్దకు వెళ్లి వెదుకుతుండగా.. బావిలో శవమై కనిపించాడు. రాజన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజన్న భార్య దేవక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్లడించారు.

వృద్ధురాలి బలవన్మరణం

గన్నేరువరం(మానకొండూర్): హన్మజిపల్లె గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మీకాంతమ్మ (80) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు. మూడు సంవత్సరాలుగా మతిస్థిమితం లేక ఇబ్బందులు పడుతోందని, ఈ క్రమంలో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు రెండో కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

2021 ఆగస్టు 18న

మణుగూరు పీకే ఓసీపీలో బొలేరో వాహనంపై డంపర్ ఎక్కిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. క్వారీలోని హాలేజీ రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. డంపర్‌ను సడన్‌గా యూటర్న్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. బొలేరోలోని ఎలక్ట్రీషియన్ అజ్మీర భాష్య, జనర్ మజ్దూర్ సాగర్, కాంట్రాక్టు కార్మికుడు చిన్న వెంకన్న ఈ ఘటనలో మృతి చెందారు.

2020 జనవరి 24న

మందమర్రి ఏరియా ఆర్కేపీ ఓసీపీలో ఐచర్ కన్వేయన్స్ వాహనాన్ని డంపర్ ఢీకొంది. ఈ ఘటనలో దుర్గం కృష్ణస్వామి అనే కాంట్రాక్టు కార్మికుడు దుర్మరణం చెందాడు.

ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- ఓపెన్ కాస్ట్ గనుల్లో రెండు హాలేజీ మార్గాలు
- చిన్న, భారీ వాహనాలకు వేర్వేరు రోడ్లు
- రక్షణ చర్యలను పటిష్టం చేస్తున్న సింగరేణి యాజమాన్యం



సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులోని హాలేజీ రోడ్డు

గోదావరిఖని: సింగరేణి ఓపెన్ కాస్ట్(ఓసీపీ) గనుల్లో హాలేజీ ప్రమాదాల నివారణపై యాజమాన్యం దృష్టి సారించింది. భారీ వాహనాలు నడుస్తున్న రోడ్ల వెంట చిన్న వాహాలు ప్రయాణిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఉన్నాయని యాజమాన్యం గుర్తించింది. ఇటీవల సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఓసీపీల్లో పర్యటించిన రక్షణ కమిటీ బృందాలు ఈమేరకు ప్రమాదాల తీరు గుర్తించింది. అన్ని ఓసీపీల్లో భారీ యంత్రాలకు ఒక హాలేజీ రోడ్డు, కన్వేయన్స్, ఇతర విభాగాలకు చెందిన వాహనాలకు మరో రోడ్డు నిర్మించుకోవాలని సూచించాయి. రక్షణకు సంబంధించిన అంశం కావడంతో యాజమాన్యం సైతం దీనిపై సీరియస్‌గా ఆలోచన చేస్తోంది. రెండు మార్గాల నిర్మాణం కొంత ఇబ్బందికరమైనా రక్షణకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో ప్రతీ ఓసీపీలో రక్షణ చర్యలను పటిష్టం చేసేందుకు చిన్న వాహనాలకు ప్రత్యేకంగా రోడ్డు నిర్మిస్తారు. దీంతో ఏ సమయంలోనైనా కన్వేయన్స్ వాహనాలు క్వారీలోకి వెళ్లేందుకు వీలు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక చర్యలు

భారీ వాహనాలు ప్రయాణించే ప్రధాన హాలేజీ రోడ్డును దాటి చిన్నవాహలు ప్రయాణించే రోడ్డుకు వెళ్లేందుకు రోడ్డు క్రాసింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు. క్రాసింగ్‌ల వద్ద కూడా కార్మికులు లేకుండా సెన్సార్ భూం బ్యారియర్స్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. దీనిద్వారా భారీ యంత్రాలు వచ్చే సమయంలో చిన్న వాహనాలు రోడ్డు దాటడానికి వీలు ఉండదు.

పటిష్టంగా సైడ్‌బర్మ్‌లు

ప్రధానంగా భారీ యంత్రాలు నిత్యం నడిచే హాలేజీ రోడ్ల వెంట సైడ్‌బర్మ్‌ను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. దీని ద్వారా డంపర్లు సైడ్‌బర్మ్ పైకి ఎక్కి ప్రమాదాలు జరిగే వీలుండదు. అలాగే యాంటీ టాంపరింగ్ సిస్టం కూడా ప్రతీ డంపర్‌లో ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ప్రమాదాల నివారణకు సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు.

ప్రమాదాల నియంత్రణ లక్ష్యం



సింగరేణి ఓసీపీల్లో హాలేజీ రోడ్లపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే భారీ యంత్రాలు నడిచే ప్రాంతాల్లో కన్వేయన్స్ వాహనాలు(జీపు, బొలేరో) నడవకుండా ప్రత్యేకంగా రోడ్డు నిర్మిస్తున్నాం. దీనిద్వారా చిన్నవాహనాలు ఏ సమయంలోనైనా ప్రయాణించే వీలు ఉంటుంది. అలాగే రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రాబోయే రోజుల్లో ఈవిధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. – శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

మార్కెట్‌లో తెగిన చేయి కలకలం


కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు

రామగుండం: పట్టణంలోని సండే మార్కెట్‌లో బుధవారం తెగిపడిన కుడిచేయి భాగం కలకలం రేపింది. స్థానిక కార్పొరేటర్ భర్త సలీంబేగ్ సమాచారంతో సివిల్, ప్రభుత్వ రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి విచారణ చేపట్టారు. తిరుపతి కథనం ప్రకారం.. స్థానిక కబ్రస్తాన్ రైల్వేట్రాక్ సమీపంలో ఓ వ్యక్తి కుడిచేతి తెగి అచేతనంగా పడిపోయాడు. స్థానికులు వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. వయసు 50–60 మధ్య ఉంటుంది. దంతాలు ఊడిపోయి. తన పేరు మల్లేశం అని, కల్వల అని పొంతనలేని సమాధానం చెప్తున్నాడు. బాధితుడి వివరాలు తెలియరావడం లేదు. యాచకుడిగా భావిస్తున్నారు. సంబంధీకులు ఉంటే 99493 04574 నంబరుకు ఫోన్‌చేసి తమను సంప్రదించాని రామగుండం జీఆర్పీ ఔట్ పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు. చేయి భాగాన్ని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది ఖననం చేశారు. కేసు నమోదు చేశామని జీఆర్పీ పోలీసులు వివరించారు.

ఇద్దరు అదృశ్యం


లక్ష్మి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్ద రు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్ర కారం.. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన అంబటి రాజయ్య–లక్ష్మి దంపతులకు నలుగురు కూతుళ్ల, ఒక కుమారుడు ఉన్నారు. రాజయ్య కూలీ పని చేస్తూ జీవనో పాధి పొందుతున్నాడు. లక్ష్మి కొన్ని రోజులుగా అ నారో గ్యంతో బాధ పడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లతోపాటు చు ట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బు ధవారం ఆమె భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గోపాల్‌పూర్‌లో యువకుడు..


గణేశ్

కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి గణేశ్ అనే యువకుడు మంగళవారం రాత్రి ఇప్పుడే వస్తానంటూ ఇంట్లో వాళ్లకు చెప్పి, బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. బుధవారం బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పోగొట్టుకున్న బ్యాగు మహిళకు అప్పగింత


బ్యాగు అప్పగిస్తున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్‌క్రైం: ఓ మహిళ పోగొట్టుకున్న బ్యాగును కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు వెతికి, ఆమెకు అప్పగించారు. సీఐ కోటేశ్వర్ వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన కలికోట మౌనిక బుధవారం తన కుటుంబసభ్యులతో కలిసి బస్సులోకేశవపట్నం వెళ్తోంది. కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాక.. బ్యాగులు ఒకే రకంగా ఉండటంతో మరో ప్రయాణికురాలు మౌనిక బ్యాగును తీసుకెళ్లింది. బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేసింది. బ్యాగు తీసుకెళ్లిన మహిళ ఓ ఆటో ఎక్కినట్లు పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. ఆటోడ్రైవర్ అహ్మద్‌ఖాన్‌కు ఈ విషయం తెలుపగా అతను సదరు మహిళ ఇంటిని చూపించడంతో బ్యాగు దొరికింది. అందులోని బంగారు, వెండి వస్తువులను పోలీసులు బాధితురాలికి అప్పగించారు. బ్యాగును గుర్తించిన క్రైం పార్టీ పోలీస్ కుమార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అశోక్, ఆటోడ్రైవర్ అహ్మద్ ఖాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వాజీజ్ ఖాన్‌లను సీఐ కోటేశ్వర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మంకమ్మతోటలోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. 15 మంది బంగారు, 12 మంది రజత పతకాలు సాధించారు. విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కబడ్డీలో జిల్లా జట్టుకు తృతీయ స్థానం


బాలికల జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. బాలికలు అద్వితీయ పోరాట పటిమను కనబరిచి తృతీయ స్థానం సాధించారు. జిల్లా బాలికల జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 36–22 స్కోర్ తేడాతో విజయం సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, చైర్మన్ ప్రసాద్‌రావు, వైస్ చైర్మన్ అనూకర్‌రావు, కోచ్ పద్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



హరహర మహాదేవ




వేములవాడ: వరుసగా సెలవులు రావడంతో రాజన్నను బుధవారం 50వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణవ్రతాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. భక్తుల ద్వారా రూ.45లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


ముస్తాబైన అయప్ప ఆలయం


జాతర కరపత్రం ఆవిష్కరిస్తున్న భక్తులు

హరిహరపుత్రనే శరణమయ్యప్ప

- రేపు కోరుట్లలో అయ్యప్ప జాతర
- లక్ష మంది వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు సన్నాహాలు
- అన్నదానం కోసం ఏర్పాట్లు


స్వామివారు

కోరుట్ల: 'స్వామియే శరణమయ్యప్ప.. హరిహరపుత్రనే శరణమయ్యప్ప'..అనే శరణుఘోషతో నెల రోజులుగా కోరుట్ల అయ్యప్ప ఆలయ పరిసరాలు మార్మోగిపోతున్నాయి. అయ్యప్ప జాతరకు ఆలయం ముస్తాబైంది. ఈ జాతరకు దాదాపు లక్ష మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈమేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఉదయం నుంచి సాయంత్రం దాకా

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి అయ్యప్పస్వామికి సుప్రభాతసేవ, మూల విరాట్టుకు అభిషేకాలు, గణపతిహోమం, దివ్యపదునెట్టాంబడి పడిపూజ, రథోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. అయ్యప్ప ఆలయ పరిసరాల్లోని అన్నదానం కోసం ఇప్పటికే సుమారు 5 ఎకరాల స్థలంలో పరిసరాలు పరిశుభ్రం చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వేయి మంది వలంటీర్ల సహకారం తీసుకోనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. అయ్యప్ప మాలధారులకు, ఇతర భక్తులకు వేర్వేరుగా భిక్ష (అన్నదానం) నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

లక్ష మంది వస్తారని అంచనా

ఏటా డిసెంబర్ 27న జరిగే అయ్యప్ప జాతరకు కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్ మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఈ జాతరలో సుమారు 50వేల మందికి అన్నదానం చేయనున్నారు. ఈ అన్నదానానికి పెద్ద సంఖ్యలో భక్తులు విరాళాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. సుమా రు రూ.60లక్షలతో నిర్మించతలపెట్టిన ఆలయ కాంపౌండ్‌కు మాలధారులు సహకరించారని తెలిపారు. ఈనెల 27న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్ప స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటి నిర్వాహకులు కోరారు.

ఆస్తులు కాజేశారు.. అంత్యక్రియలు మరిచారు


వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొడుతున్న స్థానికులు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

- అంతిమసంస్కారాలు చేసిన స్థానికులు

జగిత్యాలక్రైం: ఆమెకు కన్నబిడ్డలు లేరు. బంధువులు అన్ని చూసుకుంటారని భావించిన ఆమె ఆస్తులు పంచించింది. కానీ.. ఆమె ఆస్తులు తీసుకుని.. తీరా ఆమె చనిపోతే కనీసం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా నిరాకరించారు. ఈ అమానవీయ ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఆమె మృతదేహాన్ని సుమారు ఆరు గంటల పాటు అంబులెన్స్‌లోనే ఉంచారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని తీన్‌ఖని చౌరస్తా ప్రాంతానికి చెందిన సాదుల సత్తమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో తమ ఆస్తిని బంధువులకు అప్పగించింది సత్తమ్మ. వృద్ధాప్యంతో మంగళవారం ఆమె ఆస్పత్రిలో చనిపోయింది. దీంతో బంధువులు అంబులెన్స్‌లో శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆస్తి తీసుకున్న వారు శవాన్ని ఇంట్లోకి నిరాకరించడంతో రాత్రి 11 గంటల వరకు మృతదేహం అంబులెన్స్‌లో రహదారిపైనే ఉంది. పట్టణ ఎస్సై గీత జోక్యం చేసుకుని వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొట్టి మృతదేహాన్ని అందులో ఉంచారు. అయితే బుధవారం కూడా ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులెవరూ రాకపోవడంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె ఆస్తులు పంచుకున్నవారు మాత్రం అంత్యక్రియలకు రాకపోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జిల్లాస్థాయి జూడో పోటీలకు స్పందన


తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో బుధవారం కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జూడో సబ్ జూనియర్స్, కెడెట్స్ బాలబాలికల ఎంపిక పోటీలకు విశేష స్పందన వచ్చింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు ఈ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో జూడో పోటీలకు మానేరు విద్యాసంస్థలు నిలయంగా మారాయన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 29, 30ల్లో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగే 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా ఆతిథ్యమివ్వడం గర్వకారణమన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి సిలివేరి మహేందర్, యోగా సంఘం బాధ్యులు ఎల్వీ రమణ, గోలి సుధాకర్, శ్రీధర్, ప్రాంతీయ క్రీడా పాఠశాల కోచ్ బి.సాయిరాంయాదవ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అవ్వా.. నీకు పింఛన్ వచ్చింది..

- పుస్తెలతాడు తీసియ్యి.. మళ్లీ ఇస్తా
- వృద్ధురాలిని నమ్మించిన దుండగులు
- రెండు తులాల బంగారంతో ఉడాయింపు
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

పెద్దపల్లిరూరల్: 'అవ్వా.. నీకు పింఛన్ మంజూరైంది.. నేను మీ ఊరికి కొత్తగా వచ్చిన కార్యదర్శిని. ఓసారి నీ మెడల నుంచి పుస్తెలతాడు తీస్తే ఫొటో తీసుకుని మళ్లిస్తా' అని నమ్మించిన ఓ నయవంచకుడు రెండుతులాల పుస్తెల తాడుతో ఉడాయించాడు. జిల్లా కేంద్రంలోని మసీదు చౌరస్తా వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్తమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ పెద్దపల్లిలోని ఆస్పత్రికి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లేందుకు మసీదు చౌరస్తా వద్దకు చేరుకుంది. అక్కడ ఆర్టీసీ బస్సుకోసం నిరీక్షిస్తోంది. ఈలోగా ఓ అపరిచితుడు సత్తవ్వ వద్దకు చేరుకున్నాడు. 'అవ్వా.. నేను మీ ఊరి కార్యదర్శిని.. నీకు పింఛన్ మంజూరైంది.. పక్కనే ఆర్డీవో ఆఫీసుకు రా' అని చెప్పాడు. దీంతో వృద్ధురాలు సమీపంలోని ఆర్డీవో కార్యాలయం వరకు వెళ్లింది. ఆ వెంటనే మెడలోని పుస్తెల తాడు తీసివ్వు, వేరొకరికి వేసి ఓ ఫొటో తీసి పుస్తెలతాడు మళ్లీ ఇస్తా అని చెప్పాడు. అప్పటిదాకా తన సెల్‌ఫోన్ వృద్ధురాలి వద్దే ఉంచుకోవాలని సూచించాడు. పుస్తెలతాడు తీసుకుని ఎటోవెళ్లాడు. ఆ తర్వాత మళ్లీ వచ్చి సెల్‌ఫోన్ తీసుకుని అప్పటికే సిద్ధంగా ఉన్న ఆటోలో ఎక్కి అక్కడి నుంచి ఉడాయించాడు. దీంతో తాను మోసపోయాయని గ్రహించిన సత్తవ్వ.. పెద్దపల్లిలో నివాసం ఉండే తన కొడుకు రాజుకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న రాజు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు సీసీ ఫుటేజీలను పరిశీలించి ప్రాథమిక ఆధారాలను సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్సై లక్ష్మణ్‌రావు సూచించారు.

జీడీకే -5 ఓసీపీ సందర్శన


క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ, అధికారులు గోపాల్‌సింగ్, చంద్రశేఖర్, డీవీరావు, వీరారెడ్డి తదితరులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీని సంస్థ ఈ అండ్ ఎం డైరెక్టర్ సత్యనారాయణ బుధవారం సందర్శించారు. గనికి సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి తీరు గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అమలు చేసే ప్రణాళికల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోల్‌బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, డీవీరావు, అనిల్‌గబాలే, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనుధర్మశాస్త్ర పత్రాలు దహనం


పత్రాలు దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

మంథని: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్ర పత్రాలను బుధవారం పట్టణంలో దహనం చేశారు. మనుధర్మశాస్త్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వ్యతిరేకంగా ఉందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గతంలోనే వ్యతిరేకించారని నాయకులు గుర్తుచేశారు. కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్ గురించి పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఇకనైనా కేంద్రప్రభుత్వ తమ పద్ధతులు మార్చుకోవాలని వారు సూచించారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడిద గణేశ్, మంద రాజేందర్, ఆర్ల సందీప్, బూడిద తిరుపతి, గొర్రెంకల సురేశ్, మహేందర్, కడారి సతీశ్, ఇరుగురాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.